క్లుప్తంగా

డప్పులతో తరలిరావాలి



సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: 26న మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో నిర్వహించనున్న వేయి గొంతులు.. లక్షల డప్పులకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివ పిలుపునిచ్చారు. గురువారం ఎమ్మార్పీఎస్ అనుబంధాల సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని మాదిగలు డప్పులతో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు పనుల పరిశీలన



విస్తరణ పనులను పరిశీలిస్తున్న పుష్ప, అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలో జరుగుతున్న జాతీయరహదారి విస్తరణ పనులను గురువారం నేషనల్ హైవే డీఈ రామకృష్ణ, స్థానిక కార్పొరేటర్ పుష్పతో కలసి పరిశీలించారు. రోడ్డు మధ్య భాగంలో మెయిన్ రోడ్డు 4లైన్లతో గ్రీల్‌తో నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఇరువైపులా 30ఫీట్ల సర్వీస్ రోడ్డు, 6ఫీట్ల ఫుట్‌పాత్‌తో కూడిన రోడ్డును అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పుష్ప మాట్లాడుతూ.. రోడ్డు మధ్యలో వస్తున్న మహనీయుల విగ్రహాలను ఎక్కడ ఉన్న వాటిని అక్కడే ఉంచాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విస్తీరణ పనులు చేపట్టాలని సూచించారు.

ఘనంగా పాతపంటల జాతర



ఎడ్లబండ్లకు స్వాగతం పలుకుతున్న మహిళలు

జహీరాబాద్: మండలంలోని ఖాశీంపూర్ గ్రామంలో గురువారం పాత పంటల జాతరను ఘనంగా నిర్వహించారు. మహిళా రైతులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జాతరలో చిరుధాన్యాల విత్తనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. కలిసి పంటలను సాగు చేసుకోవడం వల్ల లాభదాయకంగా ఉంటుందన్నారు. పశువులను సైతం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ శాస్త్రవేత్త కొలాస్, రైతులు మల్లేశం, అంజన్న, కవిత, లచ్చమ్మ, రాములమ్మ, డీడీఎస్ సభ్యులు వినయ్‌కుమార్, నర్సింహులు, మంజుల, నర్సమ్మ, ప్రజలు పాల్గొన్నారు.

ఫరీదుద్దీన్ ఆశయ సాధనకు కృషి

ఐడీసీ మాజీ చైర్మన్ ఎం.డి.తన్వీర్

జహీరాబాద్: దివంగత మాజీ మంత్రి ఎం.డి. ఫరీదుద్దీన్ ఆశయ సాధన కోసమే మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన తనయుడు, ఐడీసీ మాజీ చైర్మన్ ఎం.డీ.తన్వీర్ అన్నారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని ఫ్రెండ్స్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన జాబ్‌మేళాను సోదరి డాక్టర్ ఆఫియాతో కలిసి ప్రారంభించారు. 110 కంపెనీలకు చెందిన హెచ్ఆర్‌లు హాజరయ్యారు. 500 మంది యువతీ యువకులు ఇంటర్వ్యూలకు తరలివచ్చారు. ఈ సందర్భంగా తన్వీర్ మాట్లాడుతూ.. తన తండ్రి కుటుంబ సభ్యులతో కలిసి కూర్చున్నప్పుడు తమ చుట్టుపక్కల ఉన్న వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలని సూచించేవారని అన్నారు. అందులో భాగంగానే జాబ్‌మేళా నిర్వహించామన్నారు. 360 మంది యువకులకు స్పాట్‌లోనే నియామక పత్రాలు అందించామని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే మాణిక్‌రావు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఝరాసంగ మండలంలోని 13 మందికి రూ.3,55,500 విలువ గల చెక్కులను అందజేశారు. కృష్ణపూర్‌కు చెందిన పండరినాథ్‌కు రూ. 6 వేలు, వనంపల్లికి చెందిన మహదేవ్‌కు రూ. 30 వేలు, జీర్లపల్లికి చెందిన అహ్మద్‌కు రూ. 6 వేలు, ప్యాలరంకు చెందిన హరీశ్‌కు రూ. 19,500 వేలు, ఎల్గోయికి చెందిన మహబూబ్‌కు రూ. 33 వేలు, చిలమామిడికి చెందిన ఖాజామియకు రూ. 33 వేలు, సంగప్పకు రూ. 15 వేలు, ఝరాసంగంకు చెందిన జావెద్‌కు రూ. 22 వేలు, సమియోదీన్‌కు రూ.23 వేల చెక్కులను అందజేశారు.

జాబితాలో పేరు లేకుంటే ఆందోళనొద్దు

- పథకాల మంజూరు నిరంతర ప్రక్రియ
- ఉపాధి హామీ పథకం ఏపీడీ పూజ

మునిపల్లి(అందోల్): పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించనున్నట్లు ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఇజీఎస్) ఏపీడీ పూజా పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు సంక్షేమ పథకాలపై దరఖాస్తులు స్వీకరించారు. పొల్కంపల్లిలో గ్రామసభకు ఏపీడీ పూజ హాజరై మాట్లాడారు. గ్రామసభల్లో చదివిన జాబితా ఫైనల్ కాదని, గ్రామసభల కమిటీలు తయారు చేసిన జాబితాను తిరిగి సంబంధిత అధికారులు పరిశీలించి నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేస్తారని చెప్పారు. చదివిన జాబితాలో తమ పేర్లు లేవని కొంత మంది గొడవ చేయగా ఎంపీడీఓ హరిసందన్‌రావు కల్పించుకుని పేర్లు లేనివారు పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తు చేసుకొని, రశీదు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్, మాజీ ప్రజా ప్రతినిధులు, ఎంపీఓ అండాళ్లు, ఏఈఓలు రహిమాన్, స్నేహ, లావణ్య, అంజన్న, నిఖిత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

సంగారెడ్డి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడానికి ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తోందని మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి అన్నారు. గురువారం సంగారెడ్డిలోని 4వ వార్డు శివాజీనగర్‌లో నిర్వహించిన గ్రామసభకు హాజరై ఆమె మాట్లాడారు. ఎవరైనా కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోకుండా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): గ్రామసభలో మాట్లాడుతున్న నిర్మలారెడ్డి

ప్రజా సంక్షేమమే లక్ష్యం

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని టీజీఐసీసీ చైర్ పర్సన్ నిర్మల అన్నారు. మండల పరిధిలోని కొనాపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభకు ఆమె హాజరై మాట్లాడారు. గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణ, ఎంపీడీఓ లక్ష్మి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శివకుమార్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో ..

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా పథకాలపై చర్చించారు. కార్యక్రమంలో డీఈఓ వెంకటేశ్వర్లు, ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, ఏడీఏ నూతన్‌కుమార్, ఎంపీడీఓలు రమేష్‌బాబు, మల్సూర్, తహసీల్దార్లు శివ శ్రీనివాస్, ఉమశంకర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు, ఇళ్లు

జోగిపేట(అందోల్): అర్హులందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జోగిపేట మున్సిపల్ కమిషనర్ తిరుపతి తెలిపారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 3,6,12,17 వార్డుల్లో ప్రజాపాలన సభలు నిర్వహించారు. రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్‌కు సంబంధించి ప్రజలు వినతిపత్రాలను అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, ఆయావార్డుల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



మునిపల్లి: దరఖాస్తులు స్వీకరిస్తున్న పూజా

గ్రామసభలతో లబ్ధి

వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేక అధికారి కృష్ణ అన్నారు. అందోల్ పరిధిలోని కన్‌సాన్‌పల్లిలో గ్రామసభను నిర్వహించారు.

జిన్నారం, మాదారం గ్రామసభ రసాభాస

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని జిన్నారం, మాదారం, ఊట్ల, గడ్డపోతారం, శివానగర్, వీరారెడ్డిపల్లి గ్రామాల్లో గురువారం అధికారులు గ్రామసభలను నిర్వహించారు. జిన్నారం, మాదారం గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో గందరగోళం నెలకొంది. లబ్ధిదారుల ఎంపికలో అన్యాయం జరిగిందంటూ ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు అధికారులను నిలదీశారు. జిన్నారం గ్రామానికి చెందిన రైతులకు కొందరికి మాత్రమే రైతు భరోసా వర్తింపచేశారని ఆందోళన వ్యక్తం చేశారు.

పార్టీలకతీతంగా పథకాలు అమలు



కల్హేర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కల్హేర్(నారాయణఖేడ్): ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. గురువారం నిజాంపేట్ మండలం బాచేపల్లిలో నిర్వహించిన గ్రామసభకు ఆయన హాజరై మాట్లాడారు. పార్టీలకతీతంగా సాగు భూములకు రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌బాబు, ఎంపీఓ శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ సంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉ.11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పాడుతుందని విద్యుత్‌శాఖ అధికారులు గురువారం ఒక ప్రకనటలో తెలిపారు. అశోక్‌నగర్, రామచంద్రాపురం, రామచంద్రారెడ్డి నగర్, ఎంఆర్ఎఫ్ కాలనీ, బీడీఎల్ కాలనీ, ఎల్ఐజీ, మ్యాక్‌సొసైటీ, జీహెచ్ఎంసీ కార్యాలయం ప్రాంతం, సంగీత థియేటర్ ప్రాంతం, హెచ్ఐజీ కాలనీలకు విద్యుత్ సరఫరాకు నిలిచిపోనుంది.

రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన



మాట్లాడుతున్న డీఎస్పీ సత్తయ్య

సంగారెడ్డి క్రైమ్: చిన్నప్పటి నుంచే విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని సంగారెడ్డి జిల్లా డీఎస్పీ సత్తయ్య పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని పాఠశాల విద్యార్థులు, వాహనదారులకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గమనిస్తూ రోడ్డు దాటాలని సూచించారు. ద్విచక్రం నడిపే వారితో పాటు వెనక కూర్చున్న ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపొద్దని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అభివృద్ధిలో అగ్రగామిగా అమీన్‌పూర్

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో రూ.6 కోట్ల 82 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు పనులకు మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం లాలాబావి కాలనీలో నూతనంగా నిర్మించిన రిజర్వాయర్ నుంచి మంచినీటి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో దశాబ్ద కాలంగా పరిష్కారం కాని ఉన్న రక్షిత మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామన్నారు. ఐదు భారీ రిజర్వాయర్ నిర్మించి ప్రతి ఇంటికి మంచినీటి కనెక్షన్లు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి కాలనీలో సీసీ రోడ్లు వీధిదీపాలు, పార్కుల నిర్మించి.. అభివృద్ధిలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ప్రతీ విద్యార్థికి అపార్ ఐడీ



ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ భీంసింగ్

మునిపల్లి(అందోల్): దేశపౌరులకు ఆధార్‌కార్డు ఎలానో.. ప్రతి విద్యార్థికి అపార్ (ఆటో మెటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడి తప్పనిసరిగా ఉండాలని మండల విద్యాధికారి భీంసింగ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అపార్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. అపార్ ద్వారా విద్యార్థుల డేటా నిర్వహణలో పారదర్శకతను పెంచడమే కాకుండా, విద్యా డేటాను ఒకే చోట నిల్వ చేస్తుందన్నారు. ప్రతి విద్యార్థికి ప్రత్యేక గుర్తింపు ఐడి ఉండేలా అన్ని పాఠశాలలు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది పాఠశాలల నిర్వహణను సులభతరం చేయడంతో పాటు, విద్యార్థులకు భవిష్యత్ అవసరాలను అందించడంలో సహాయ పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది, సీఆర్‌పీలు అన్ని రకాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

డంప్‌యార్డును తొలగించాలని వినతి

సంగారెడ్డి టౌన్ : మండలంలోని పసల్వాది గ్రామ శివారులో ఏర్పాటు చేసిన డంప్‌యార్డును తొలగించాలని గురువారం గ్రామస్తులు కలెక్టరేట్‌లోని ఏఓ పరమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ.. డంపింగ్ యార్డుతో గ్రామస్తులు అనారోగ్యాల బారిన పడతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులకు పలు మార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. డంప్ యార్డును అక్కడ నుంచి తొలగించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో హరిప్రసాద్ ముదిరాజ్, వినోద్ రెడ్డి, గణేష్, కిరణ్ ఉన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్ చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. బుధవారం నిర్వహించిన తనిఖీల్లో 11 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా 8 మందికి రూ.1500, మరో ముగ్గురికి రూ. 2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వట్‌పల్లి(అందోల్): మండలంలోని ఉసిరికపల్లి 1వ వార్డులో మంత్రి రాజనర్సింహా సహకారంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అభివృద్ధికి సహకరిస్తున్నందుకు మంత్రికి గ్రామస్తుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు అంబయ్య, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు నవీన్, నాయకులు జనార్దన్, రమేష్, మల్లయ్య, విఠల్, నాగరత్నం పాల్గొన్నారు.

27న నిధి ఆప్కే నిఖత్ 2.0

పటాన్‌చెరు టౌన్: భవిష్యత్ నిధి సంస్థ ద్వారా సమస్యల పరిష్కారానికి ఈ నెల 27న నిధి ఆప్కే నిఖత్ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్ ఆగర్వాల్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 3 కేంద్రాల్లో శిబిరాలను ఉ. 9:30 నుంచి సా. 5:45 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. బొల్లారం రోడ్డు జయప్రకాష్ నారాయణ నగర్ ఆర్బిజన్ ఫార్మాసుటికల్ సర్వీసెస్, పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని కిర్బీ బిల్డింగ్ సిస్టం అండ్ స్ట్రక్చర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, జహీరాబాద్ అల్గోల్ రోడ్డులో ఫ్రీ- గెరియ కన్సర్వ అల్లనా ప్రైవేట్ లిమిటెడ్ వద్ద ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సమస్యలు ఉన్న వారు పరిష్కరించుకోవాలని సూచించారు.

సర్వే, ల్యాండ్ రికార్డ్స్ జిల్లా కమిటీ ఎన్నిక

సంగారెడ్డి జోన్: సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఫోరమ్ జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా గురువారం ఎన్నికైంది. సంగారెడ్డి టీఎన్‌జీఓ భవనంలో నిర్వహించిన ఎన్నికల్లో ఫోరమ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.రాజు, జి.రాము ఎన్నికయ్యారు. కోశాధికారిగా వి.వెంకటేశంతోపాటు 16 మందితో కూడిన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా టీఎన్‌జీఎస్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కసిని శ్రీకాంత్, ఎలక్షన్ అధికారిగా ఎం.డీ.అజీమ్ వ్యవహరించారు.



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న అధికారులు

గురుకులంలో మాక్ పోలింగ్



ఓట్లు వేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

నారాయణఖేడ్: మండలం పరిధిలోని జూకల్ శివారులోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకులంలో గురువారం మాక్ పోలింగ్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సర్పంచ్, వార్డు, కౌన్సిలర్ పదవులకు నామినేషన్లు దాఖలు చేశారు. 25న జాతీయ ఓటరు దినోత్సవంలో భాగంగా ప్రజాస్వామ్యంలో ఓటు యొక్క ఆవశ్యకతను తెలియజేసేలా మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. విద్యార్థులకు అర్హులు విధిగా ఓటరుగా నమోదు చేయించుకోవడమే కాకుండా తమకు నచ్చినవారికి ఓట్లు వేసేలా అవగాహన కల్పించారు. నిజమైన పోలింగ్‌ను తలపించేలా మాక్ పోలింగ్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా ఓట్లు వేశారు.

బీజేపీతోనే అంబేడ్కర్‌కు గౌరవం

బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కమలాకర్

హత్నూర(సంగారెడ్డి): అంబేడ్కర్‌ను ఎక్కువగా గౌరవించిన పార్టీ బీజేపీయేనని ఆ పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కమలాకర్ అన్నారు. గురువారం మండంలోని బోరుపట్లలో ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో 26 నవంబర్ 2015న తొలిసారి రాజ్యాంగ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించినట్లు తెలిపారు. నరేంద్రమోదీ నాయకత్వంలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ గౌరవార్థం పంచతీర్థల అభివృద్ధితో పాటు అణగారిన వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాల చేపట్టామన్నారు. కార్యక్రమంలో యువ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి మల్లేశం, ఓబీసీ మోర్చా కార్యదర్శి సాయిరాం, నాయకులు పాల్గొన్నారు.




సంవిధాన్ గౌరవ్ అభియాన్‌లో పాల్గొన్న నేతలు

సంక్షిప్త వార్తలు

◆ డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

సంగారెడ్డి క్రైమ్: పట్టణంలో బుధవారం అర్ధరాత్రి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ మాట్లాడుతూ.. టౌన్ పరిధిలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాత బస్టాండ్ ఆవరణ, పోతిరెడ్డిపల్లి చౌరస్తా , బైపాస్‌లోని గుర్రపుబొమ్మ వద్ద ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి షకిల్ అహ్మద్ సిద్దిఖి ఒకరికి మూడు రోజులు జైలు శిక్ష, నలుగురికి రూ.2000, ఒకరికి రూ.1000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ ఘనంగా నేతాజీ జయంతి



న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని వడ్డి గ్రామంలో గురువారం నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన చౌరస్తా వద్ద నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఆనందేశ్వర్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేతాజీ నగర్‌లో..

సంగారెడ్డి ఎడ్యుకేషన్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి సందర్భంగా సంగారెడ్డిలోని నేతాజీ నగర్‌లో బీజేపీ పట్టణశాఖ ఆధ్వర్యంలో నేతాజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. అజాద్ హింద్ ఫౌజ్ స్థాపించి దేశ స్వతంత్రం కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు.

◆ ఫ్యాన్లు అందజేత

కొండాపూర్(సంగారెడ్డి): మండలంలోని తొగర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రవి ఆరుఫ్యాన్‌లు, నాలుగు ట్యూ బ్‌లైట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తాను చదువుకున్న పాఠశాలలో విద్యార్థులు,ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతుండటంతో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లను అందజేశానని తెలిపారు.

◆ పేకాటరాయుళ్లపై కేసు నమోదు

సంగారెడ్డి క్రైమ్: పట్టణంలోని ఇందిరాకాలనీకి చెందిన ఐదుగురు పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు సంగారెడ్డి పట్టణ సీఐ శంకర్ నాయక్ తెలిపారు. సంగారెడ్డి పట్టణ సీఐ రమేష్ ఆధ్వర్యంలో ఇంద్రకాలనీలో పేకాట ఆడుతున్న వారిపై పక్క సమాచారంతో దాడి చేసి రూ.7,335 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

◆ ట్రాఫిక్ కష్టాలు తొలగించాలి

జహీరాబాద్ టౌన్: పట్టణంలో తీవ్రంగా ఉన్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో రద్దీ పెరిగిందని, ప్రధాన రహదారితో పాటు వీధుల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. ఆస్పత్రిలోకి 108 అంబులెన్స్ వెళ్లడానికి కూడా తిప్పలుతప్పడం లేదన్నారు. రోడ్ల పక్కన తోపుడు బండ్లు, వాహనాల పార్కింగ్ ఇష్టా రాజ్యంగా చేయడంతో ప్రజలు, వ్యాపారులు అవస్థలు పడుతున్నారని వాపోయారు. అధికారులు స్పందించి ట్రాఫిక్ కష్టాలు తొలగించాలన్నారు.

◆ జాతర పోస్టర్ ఆవిష్కరణ

న్యాల్‌కల్(జహీరాబాద్): 7 నుంచి ప్రారంభం కానున్న ఉర్సే షరీఫ్ హజ్రత్ పీర్‌గైబ్ సాహెబ్ ఖిబ్లా జాతర పోస్టర్‌ను గురువారం బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఉత్సవ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. ఉత్సవాలకు తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్రాలకు చెందిన ప్రజలు వస్తుంటారని, వారికి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జోగిపేట(అందోల్): జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో రూ.1.40 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులకు గురువారం మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. మంత్రి దామోదర రాజనర్సింహా చొరవతో వార్డు పరిధిలోని రాజరాజేశ్వరీ దేవాలయం నుంచి మేలకుంట వరకు 500 మీటర్ల పొడవునా అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే, రూ.3 లక్షలతో హైమాస్ లైట్ల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ వసంత కుమారి, కమిషనర్ తిరుపతి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ మల్లయ్య

నిర్లక్ష్యధోరణి విడనాడాలి

జహీరాబాద్ టౌన్: వాహనదారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఎస్ఐ.కాశీనాథ్ పేర్కొన్నారు. రోడ్డుభద్రత మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత నిబంధనలు విధిగా పాటించాలని సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తుంటే జరిమానాలు విధిస్తున్నామని, అయినా మార్పు రావడ లేదన్నారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిద్దారెడ్డి, షీటీం పుష్పలత, వైస్ ప్రిన్సిపాల్ మారుతిరావు, డైరెక్టర్లు అమర్‌నాథ్, సంజీవ్‌రావు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ కాశీనాథ్